


"గాజులు గాజులు!"

ఎక్కడ ఏ మూలనున్నా ఆ కేక విన్పించేసరికి నాగస్వరం విన్న నాగు బాములాగా పరుగు పరుగున వచ్చేస్తుంది మాధురి.

"కొత్త రకాలేమున్నాయి తాతా?"

ప్రశ్నించుతూన్న మాధురిని నఖ శిఖ పర్యంతం చూచి ప్రేమగా నవ్వాడు పట్టాభి. "వారానికోసారి కొత్త కొత్త రకాలు వచ్చేస్తాయటమ్మా వెట్టితల్లీ?" ఆపేక్షగా చూస్తూ అన్నాడు. "దా, ఇందులో నీకు ఏవి నచ్చాయో చూడు!"

దగ్గరకు వెళ్ళలేదు మాధురి. అలాగే గోడకు ఆనుకునుంచుని గాజుల వ్యాపారం అంతటినీ విస్ఫారిత నయనాలతో చూడ సాగింది.

"విశాలా, గాజులతాత వచ్చాడు చూడు!" వత్తులు చేసుకొంటూన్న భద్రమ్మ కోడల్ని కేకవేసింది.

పది నిముషాల తర్వాత లోపలినుండి వచ్చింది విశాలాక్షి. "ఏం, తాతా వచ్చావా?" సాదరంగా పలుకరించి ఒక్కసారి గాజుల పొట్లాలన్నీ కలయ జూచింది. నిండుగా గాజులున్న తన చేతులను ఒక్కసారి చూచుకుని, "చాలా పనిలోవున్నాను తాతా, పైవారం వస్తా వుగా?" అన్నది.

అర్థం చేసుకున్నాడు తాత. "అయిదువ తనపు వస్తువుల్ని 'ఉన్నాయిలే— ఇప్పుడు వద్దు' అనడం ఆచారం కాదు! "అలాగే తల్లీ, వచ్చే సోమవారం వస్తాను లెండి" అంటూ వ్యాపారం అంతా వెదకి వెదకి గాజులు తీశాడు. వెడల్పాటి ఎట్టటి గాజులమీద అద్దాలు అతికించి చాలా అందంగా వున్నాయి.

"దా తల్లీ." మాధురిని పిలచాడు.

"ఇది తియ్యని బాధతల్లీ! చేతులు నొప్పి పుట్టినా గాజులు వేసుకోవాలికదూ!''

మాధురి సందేహిస్తూ అమ్మదెసా, నాయనమ్మ దెసా చూచింది.

"అఁ. ఎందుకు చిన్నపిల్లలకి మట్టి గాజులు? చేతులు మోటుగా కనిపిస్తాయి."

విశాల వారింపును తేలికగా త్రోసేశాడు పట్టాభి. "ఊరుకోండమ్మా. పిల్లలకి సరదా. మీరలాగ అంటారనే, పాపం అమ్మాయిగారు అంతదూరంగా నుంచుంటారెప్పుడూ." అంటూ "దా నాన్నా.'' అని పిలిచాడు మాధురిని గాజులు చూపుతూ.

అప్పటికీ కదలలేదు మాధురి.

''అమ్మమాట కేంటమ్మా, నే నేస్తాగా?'' తానేలేచి మాధురి దగ్గఱకువెళ్ళి గాజులు చేతికి తొడిగాడు "చూచుకో తల్లీ ఎంత బాగున్నాయో చిట్టిచేతులు మరి!'' అని ఒక్కసారి విశాలనూ భద్రమ్మనూ మార్చి మార్చి చూశాడు. మాధురితో రహస్యం చెప్పినట్టు చెప్పాడు ''అమ్మోవ్. అమ్మకీ నాయనమ్మకీ అలా బెదిరిపోయావంటే రేపు నల్లటి మొగుణ్ణితెచ్చి పెళ్ళి చేస్తారు నీకిష్టం లేకపోయినాసరే. ఇంత నోరులేని తల్లివైతే ఎలాగనాన్నా? నీక్కావలసినవి గట్టిగా అడగాలి.''

తెలిసీ తెలియని మాధురి సిగ్గుగా నవ్వింది.

భద్రమ్మ నిండుగా నవ్వుతూ, అర్థయుక్తంగా తల పంకించింది? విశాలాక్షి గంభీరంగా చిరుదరహాసం చేసింది.


''ఎంత? గాజులు బాగున్నాయి. జతా రూపాయో, రూపాయిన్నరో వుండవూ?" మాధురికి తొడిగిన గాజుల జతను పరిశీలనగా చూస్తూ ప్రశ్నించింది విశాల!

"ఊరుకోండమ్మగారూ, నా బంగారు తల్లికి యిచ్చిన గాజులకు నేనెప్పుడైనా ధర చెప్పానా, తీసుకున్నానా?'' అంతలో పట్టాభి స్వరం దీనంగా మారిపోయింది. ''నాకూతురి కూతురు—మాణిక్యంకూడా సరిగా యింతే వయస్సుదమ్మ గారూ. పుష్కరాలకి పుట్టింది. ఎప్పుడో రెండేళ్ళనాడు చూచానంతే తల్లినీ—బిడ్డనీ. ఓసారి చూచుకోవాలని ప్రాణం కొట్టుకపోతోంది. పంపరుగా ఆ రాక్షసులు! నాకూతురి ఖర్మేమో గాని—ఆ నోరు లేని దానికి అత్తా మొగుడూ అందరూ రాక్షసులే దొరికారు!" పై తువ్వాలుతో కళ్ళు ఒత్తుకున్నాడు.

అంతలో వంటమనిషి తెచ్చి అందించిన మజ్జిగగ్లాసు గటగటా త్రాగి ఖాళీ చేసేసి, ''వస్తానుతల్లీ మరి! మళ్ళీవారం దర్శనం చేసుకొంటాను'' అని నిష్క్రమించాడు.

''పాపం! వెఱ్ఱి ముండావాడు!" భద్రమ్మ స్వగతం పైకే విన్పించింది.

''ఏమీకాదు.'' తీసిపారేసినట్టు అన్నది



కోడలు విశాలాక్షి.

"మనం, వాడు వచ్చినప్పుడల్లా యిచ్చే మజ్జిగలు, భోజనాలు, కూరలు, జొన్నలు—ఒక చేమిటి— ఇవన్నీ తక్కువా? అందుకే పాపకు గాజులు ఊరికే యిస్తూంటాడు. తెలివితక్కువ వాడేమీకాదు!"

"ఊరుకుందూ విశాలా." కోడలి మాటలు నచ్చలేదు భద్రమ్మకు. "అటువంటి స్వల్ప దానధర్మాలు ఇంకా చాల మందికి చేస్తున్నాం మనం. అందరూ అలా వుంటున్నారా? గాజుల తాత మనసు మంచిది!"

మరి సంభాషణ సాగలేదు.

అతడిపేరు పట్టాభి అని ఎవ్వరికీ గుర్తువుండదు. గాజుల తాతే అతని నామాంతరం.

## 2

స్కూలు నుంచి వచ్చిన మాధురి, లోపలి వరండాలో భద్రమ్మతో మాట్లాడుతూన్న పట్టాభిని చూచి. "వచ్చావా తాతా!" అంటూ సంతోషాతిశయంతో పరుగున దగ్గరకు వెళ్ళింది.

"వచ్చానమ్మా." అనలేక అన్నాడు పట్టాభి, కనులు వర్షిస్తూన్న నీటిని వదే వదే పైపంచతో వొత్తుకుంటూ, బాగా చిక్కివున్నాడు. బాగా దిగులుగా వున్నాడు; దుఃఖిస్తున్నాడు. ఆ కంఠంలో ఇదివలకటి ఉత్సాహం, అనురాగం లేవు. ప్రక్కనే బిక్కముఖంతో ఓ పన్నెండేళ్ళ బాలిక నిలబడివుంది. మాసిన చిరుగుల బట్టలు; సంస్కారంలేని తల!

"ఇన్నాళ్ళ నుంచీ రావటంలేదేం?"

అతడి స్థితి నర్థం చేసుకోలేని మాధురి మరింత దగ్గరగా పోయి ప్రశ్నించింది, "ఏదీ, నీ గాజుల కావడి ఏది?"

"అయ్యో తల్లీ. ఏం చెప్పను? నా బ్రతుకే బుగ్గి అయిపోయింది?" ఒక్కసారిగా భోరుమన్నాడు పట్టాభి.

"భడవఖానా, వెధవ ఆరాలూ, అడగడాలూ నువ్వూను! పో లోపలికి." భద్రమ్మ కసరడంతో మాధురి లోపలికిపోయి తొంగితొంగి చూడసాగింది.

"ఊరుకో తాతా ఊరుకో. ఏం చేస్తాం? అంతా ఖర్మ!" పట్టాభిని ఓదారుస్తోంది భద్రమ్మ.

"అది సహజంగా చచ్చిపోతే నాకింత బాధ వుండదు అమ్మగారూ. అత్తపెట్టే బాధలూ, మగడు పెటే కసిడికోతా భరించలేక నూతిలోదూకి చచ్చిపోయిందమ్మగారూ!" భరించలేని కడుపుశోకంతో గుండెలు బాదుకుంటూ జుట్టు పీక్కుంటూ ఏడుస్తున్నాడు పట్టాభి. "అభం శుభం ఎరగని ఈ పసిదాన్ని నాకు వదలిపోయింది—ఎలా పెంచను దీన్ని?" మనమరాల్ని చూచి భయపడుతూన్నట్టుగా అన్నాడు.

తాత ఏడుపుచూచి పిల్లది కూడా ఏడ్వడం మొదలుపెట్టింది.

"ఊరుకోవే సీతా ఊరుకో....చూడు పటాభీ, పిల్లబెంబేలు పడిపోతోంది. దుఃఖం దిగమ్రింగాలి మరీ....దేవుడేదో ఓదారి చూపకపోడు..." శక్త్యానుసారం ఓదార్పు వాక్యాలు పలుకుతూన్నది భద్రమ్మ.

అంత లోనుంచి వచ్చింది విశాలాక్షి. చిటపట లాడుతూన్న వదనంతో సాధ్యమైనంత ప్రసన్నతను నింపుకోను ప్రయత్నిస్తూ అన్నది: "జరిగిన దారుణం.... విన్నాము పట్టాభీ. ఏం చేస్తాం? దేవుడలా చేశాడు మరి, మనసు దిట్టపఱచుకో." పొడిపొడిగా ఓదార్చింది.

ఒక్కసారి ఆమె ముఖం తేరిపార చూచాడు పట్టాభి, కళ్ళు తుడుచుకున్నాడు. "అంతేలే తల్లీ." నీరసంగా అంటూ మనుమరాల్ని వెంటబెట్టుకుపోయాడు.

"శుక్రవారం పూటా ఎందుకు మనింట్లో వెధవ ఏడుపులు? వాడింటో వాడు పడి ఎంతైనా ఏడవవచ్చు ..." అంటూ మెల్లని స్వరాన విసుక్కుంటూన్న తల్లిదెస ఆయోమయంగా చూచింది మాధురి.

"పాపం గాజుల తాత ఏడుస్తోంటే నాకూ ఏడుపొచ్చిందే మరి అమ్మకెందుకురాలేదూ? పైగా కోపం వచ్చింది కూడా!" తన మనసులోని భావాన్ని పైకి వ్యక్తం చేయటానికి ధైర్యంలేదు మాధురికి.

## 3

"గాజులు, గాజులు!"

గాజుల అమ్మకమే జీవనోపాధి అయిన పట్టాభికి పుట్టెడు దుఃఖంలో ఉన్నా వీధులవెంట తిరిగి అమ్ముకోవాల్సిన

అగత్యం తప్పిందికాదు. కాని ఆ గళంలో యెంతో పీరనం. నిర్జీవత! వెనకటి ఉత్సాహం. జీవం ప్రస్తుతం వినరావటం లేదు. కాని అంత విచారంలోనూ అతడికి మాధురిపట్ల గల మమకారం మాత్రం మరుగున పడలేదు. వారం వారం వస్తాడు. విశాలాక్షి గాజుల కొనుగోలు చేసినా చేయకపోయినా, తాను మాత్రం విధిగా మాధురి చేతులకు రెండుగాజులు తొడిగి వెళ్ళిపోతాడు. మాధురి ఎదుట కన్పించకపోతే "ఏదీ, చిట్టితల్లి?" అంటూ వెదకి వెదకి పిల్చి మరీ తన ముఖుపు చెల్లిస్తాడు.

"ఊరుకుందూ తాతా. ఎందుకు చెప్పు? ఇన్నాళ్లూ అయితే నా మనమరాలు, మనమరాలు అంటూ ఒకటే ఇదై పోతూ దాన్ని గుర్తుచేసుకుంటూ ఆ అమ్మాయికి గాజులిచ్చేవాడివి. ఇప్పుడు నీ సీత నీయింట్లోనే వుందిగా?" భద్రమ్మ ఒకనాడు వారించింది.

"ఏంమాట పెద్దమ్మగారూ అది? నా మనుమరాలొకటీ, నా చిట్టితల్లి ఒకటీ కాదు నాకు!" స్థిరంగా పలికిన పట్టాభి స్వరంలో ఎంతో దర్పం! మరెంతో మమత!

పట్టాభి నిష్క్రమణానంతరం విశాలాక్షి చాలా విసుక్కొంది— "ఏడిశాడు వెధవ—వెధవ పోలికాను. వాడి గతి మాలిన మనుమరాలూ, మన బంగారు తల్లీ ఒకటేనా?"

బాధపడ్డది భద్రమ్మ. "అయిదువతనపు గాజులను అస్తారుబతంగా తెచ్చి చేతులను అలంకరించే అల్పసంతోషి పట్టాభి! వయస్సు మీరిన వృద్ధు! అంతంత మాటలు నువ్వు అనకూడదు విశాలా." పెద్దరికపు హుందాతో వారించింది కోడలిని.

అప్పుడప్పుడు పట్టాభితో కలసి వచ్చే సీత—ఆ నెలకానెల, ఆ ఏటి కాఏడు పైనబడినకొలదీ చిన్నచిన్న పనులుచేసి పోవటానికీ, మాధురితో ముచ్చటలాడటానికే తఱచుగా ఆ యింటికి రాసాగింది. మాధురికీ, సీతకూ స్నేహం పెరిగింది.

"బొత్తిగా రెక్కలకష్టంమీద పెరిగే దౌర్భాగ్యుణ్ని. ఒక్కగా నొక్క పిల్లను కూర్చోబెట్టి పెట్టలేక పనులకు పంపుతున్నాను. తల్లీ తండ్రిలేని పిల్లకాస్త మీరే కనిపెట్టాల పెద్దమ్మగారూ" అంటూ అప్పుడప్పుడు కంట తడిపెట్టేవాడు పట్టాభి.

"నువ్వు చెప్పకపోతే నాకు తెలియదట్రా పట్టాభీ. ఊరుకో, బాధపడకు!" స్వాంతన వచనాలు పలుకుతూ, పండో ఫలమో పైకమో శక్త్యానుసారం యిస్తూ ఆ పిల్ల చేసిన దానికంటె ఎక్కువగానే ముట్టజెప్తూండేది భద్రమ్మ.

## 4

"అమ్మాయిగారూ, మీ చేతులెంత అందంగా వుంటాయండీ!" హూం

మాల కట్టుకుంటూన్న మాధురి దగ్గఱకు చేరిన సీత, తదేకంగా ఆమెను చూచి, చూచి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది

"అహాఁ!" మాధురి ఆశ్చర్యం ప్రకటిస్తూ తనచేతులనూ, సీతచేతులనూ మార్చిమార్చి చూచింది. "నిజమే! పని పాటలతో మొరటుదేలి, మురికిపట్టిన చవక రకం మట్టిగాజులతో వున్నాయి సీత చేతులు. పాపం, దుస్తులూ అంతంత మాత్రమే! నేను కట్టి కట్టి వదిలేసిన పాత బట్టలు—చిరుగులవేగా సీత వేసుకునేది? కాని, సీత ఎంతందంగా, ఎంత తెల్లగా వుంటుంది! దానిముందు నేను నలుపేగా?"

తన ఆలోచనలను పైకివ్యక్తం కానీయకుండా, ప్రకాశంగా అన్నది: "ఏదో అంటావుకాని, ఏం బాగున్నాయిసీతా? నీకంటె అందంగా వుంటానా నేను?"

సీత కొలదిక్షణాలు తెల్లబోయి మాట్లాడలేక పోయింది "పనిపాటలు చేసుకొనే పేదదానికి కూడా అందమా?"

అప్పుడప్పుడే బాల్యాన్నివీడి కన్యావస్థలో అడుగిడబోతూన్న—లోక మాలిన్య మెరుగని పసితనాన్ని పూర్తిగా వీడని పదమూడేళ్ళ ప్రాయంలోవున్న అమాయికలు ఇరువురూ కూడ!


తేరుకొన్న సీత మెల్లగా అన్నది! "మీ చేతుల్న ఆ గాజులు—ఎంత బాగున్నాయి అమ్మాయిగారూ! చక్కగా మెళ్లో గొలుసులూ............ సిల్కు బట్టాలూ........"

జాలితో ద్రవించి పోయింది మాధురి. "వేసుకోవాలనుందా? ఇంద, వేసుకు చూడు!" సీత వారించుతూన్నా వినక తన చేతి బంగారుగాజులు తీసి ఆమెచేతికి తొడిగింది మాధురి.

ఏనాడూ "బంగారం" అనే వస్తువును తాకికూడా ఎరుగని సీత పరమానందంతో మైమఱచి చూచుకొంది తన చేతులను. కాని ఆ పరవశావస్థనుండి నిజస్థితిని గుర్తించినది మాత్రం విశాలాక్షి కఠినోక్తుల వలన.

"ఎంతలో వుండేవాళ్లు అంతలో ఏడవాలి కాని ఏమిటా విరగబాటు? అమ్మాయిగారి అంతరమేం—నీ అంతరమేం? కలవారిబిడ్డ లెన్నైనా పెట్టుకొంటారు, అవన్నీ కావాలని అడిగేసేయటమే వెనక ముందులులేకుండా? నీ దరిద్రపు మొహానికి నగలొకటి తక్కువయ్యాయా?.... అయినా దానికి బుద్ధిలేకపోతే నీకు తెలియక్కర్లేమా మాధురీ? నీ ఒంటిమీది నగలు ఆ శవి మొహానికివ్వడమే? బోడి స్వతంత్రమా అని!........" అలా అనర్గళంగా—సీతను ఘాటుగా, తన కుమార్తెను మెత్త మెత్తగా మందలించిన విశాలాక్షి ఆ విషయాన్ని అంతతో వదలి పెట్టలేదు.

పనిమాలా పట్టాభికి కబురంపి మరో దండకం చదివింది. "ఏదో తల్లిలేని పిల్లకదాని కనికరిస్తే దానికేమీ తెలియ




కుండావుంది. నెత్తికెక్కుతోంది. ఇవాళ యిదైంది, రేపు మరొహటౌతుంది. అట్టే వెకిలివేషాలువే యొద్దని చెప్పు........"

పట్టాభి మరి వినలేక పోయాడు. ఒళ్లు తెలియని కోపంతో చావగొటాడు మనుమరాల్ని.

"కూడూ, గుడ్డా దొరక్కుండా పోవచే దరిద్రపుదానా, తిన్నింటి వాసాలు లెఖ్ఖపెట్టి? ఇలాంటి ఎధవేషాలు ఎప్పుడూ ఎయ్యటోక........" నోరు నొప్పిపెట్టేంతగా అఱచి, చేతులు నొప్పిపుట్టేవఱకూ కొట్టాడు సీతని. అంతలో ఆలయంనుండి శ్రద్దమ్మ తిరిగి రాకుంటే, ఆ పిచ్చి కోపంలో అతడు సీతని చంపేసేవాడేమో!

పిల్లని వెనక్కుతీస్తూ కోప్పడింది శ్రద్దమ్మ. "పిచ్చేమైనా ఎక్కిందట్రా పటాభీ? చంపేస్తావా ఏం దాన్ని? పసిదానికా అంతరాలన్నీ ఏం తెల్సు గనుక?"

అటు తిరిగి కోడల్ని కూడా మందలించింది. "దగ్గరుండి పసిదాన్ని చావబాదించుతుఁణావా విశాలా? ఎంత కఱకు గుండె నీది?"

వణుగుకుంటూ విశాల లోపలికి నిష్క్రమించింది.

"తప్పులు చేసినా, పిల్లలకు బుద్ధి చెప్పుకొనేతీరు అదికాదు." అంటూ పట్టాభిని మరింత కోప్పడింది. "తల్లిలేని పిల్ల. ఉన్నది నీవొక్కడివి, ఇక దాన్ని చేరదీసేవారెవరు."

కళ్లు ఒత్తుకున్నాడు పట్టాభి. "ఏంటో అమ్మగారూ, కూతుర్ని పోగొట్టుకున్న పాపిష్ఠోణ్ణి. పిచోణ్ణయిపోయాను." మనుమరాల్ని ఎత్తుకొని వెళ్ళిపోయాడు.

ఆరోజునుంచి మరెన్నడూ సీత తన

హద్దులను దాటి ఎరుగదు. అమ్మాయిగారు మాధురికీ తనకూ గల బేధమెంతో బాగా తెలిసివచ్చింది.

ఏదో కోపం కొలదీ కొట్టాడన్న మాటేగాని పట్టాభికి సీతపై గల మమకారం ఎంతటిదో ఎవరికీ తెలియనిది కాదు. "సీత అడగలేదు. గాజులు నేనే యిచ్చాను" అని చెప్పాలని ఎంతగానో ప్రయత్నించింది మాధురి. కాని తల్లి భయంతో ఆమాట ఎక్కడా పైకి రానీయ లేకపోయింది.

సీతకు జ్వరంగా వుందని తెలిసి లేతమనసు గిజగిజలాడి పోయింది; ఏం చేయాలో తెలియలేదు. 'బహుశః గాజుల తాత కొట్టినందుకే కావచ్చు' అనుకొంది. స్కూలునుంచి ఇంటికి వస్తూ ఓ అడుగు అటువేసి సీతను చూచి వచ్చింది ఒక నాడు.

విషయం తెలిసిన విశాల ఎంతైనా ఆర్భాటం చేసింది. అప్పటినుంచీ జడిసి పోయిన మాధురి గాజుల తాతపట్లా.అతడి మనుమరాలిపట్లా తనకుగల అభిమానాన్నంతా గుప్తంగా ఎదలోనే దాచుకో సాగింది.

## 5

"అమ్మాయిగారి పెళ్ళా?" వింటూనే విపరీతమైన సంతోషాన్ని ప్రదర్శించాడు గాజుల తాత. "నా చిట్టితల్లికి పెళ్ళి గాజులన్నీ నేనే యేస్తాను. ముత్తయిదువలందరికీ నేనే గాజులు తొడగాల. మంచి బహుమానం ఇప్పించాలమ్మోయ్ నా బంగారు తల్లీ!"

పెళ్ళి హడావుడి అంతా తనదేనన్నట్లుగా మసిలాడు పట్టాభి. మాధురి పెళ్ళి నిర్ణయమైన దగ్గర్నుంచీ, "అమ్మగారూ, అమ్మగారూ" అంటూ ఏదో ఓ పని అందుకుంటూనే వున్నాడు. సీత అసలే ఇరవై నాలుగ్గంటలూ అక్కడే గడప సాగింది. అక్కడే తింటూ తీరికలేని పని చేస్తూ.

పెండ్లినాటి ఉదయం పెండ్లికుమార్తె మాధురి చేతులకు ఎంచి ఎంచి మంచి మంచి గాజులు తొడిగాడు పట్టాభి. కన్ను చెదిరే అలంకారంలో వున్న మాధురి— మంగళప్రదమైన ఆ గాజుల మలారానికి నమస్కరిస్తూంటే పట్టాభి కనులు నీరు తిరిగాయి. "అమ్మాయిగారు అత్తవారింటికి వెళ్ళిపోతే ఇంక కప్పించరు ఇలా రోజురోజూ!" అన్పించి ఎంతో మధన పడ్డాడు. అంతలోనే మరో ఊహ కదులాడిన అతడి హృదయం తల్లడిల్లిపోయింది. "అమ్మాయిగారూ, సీతా ఒక్క ఈడువాళ్ళేకదా! మరి సీత పెళ్ళెప్పుడూ? పెళ్ళి చేయటానికి నా దగ్గఱ డబ్బేదీ?"

పెళ్ళికి వచ్చిన ముత్తయిదువ లందరికీ కూడా కోరిన గాజులు వేయించింది విశాలాక్షి ఆచారప్రకారం. గాజుల డబ్బుతోబాటు మంచి పంచెల చాపు



యువ



" నేను టెక్స్టయిల్ యింజనీయరునండీ "

" ఐతే. నీకు రాటం వడకటం వచ్చునా ?"

బహూకరించాడు మాధురి తండ్రి వెంకట్రామయ్య. ఎంతగానో సంతసించాడు పట్టాభి. "సుఖీభవతల్లీ! సుఖీభవ! నువ్వు కలకాలం సుఖంగా వుండాలి. నాకిలాగే బహుమతు లిప్పిస్తూండాల....అమ్మోవ్! మళ్ళీ ఆర్నెల్లనాటికి పచ్చగా వస్తావ్. పండంటి పాపాయి నెత్తుకోవట్టానికి. నేనేగా, అప్పుడు మోచేతులవఱకూ గాజులు వేసేది!"

సిగ్గుతో ముడుచుకుపోయింది మాధురి.

మాధురి అత్తింటికి పయనమై పోతూంటే తల్లిదండ్రులతో సమంగా దుఃఖించాడు పట్టాభి "సూడాలనుంటే రంయ్యాన వచ్చి విమానం మీద వాల్తది తల్లి. మీకేంలోటు, ఆరికేంలోటు?ఎందుకు విచారం?"అంటూ తిరిగి తానే భద్రమ్మనూ విశాలనూ వెంకట్రామయ్యనూ ఓదార్చాడు.

"ఇంతుండే అమ్మాయిగారికి అప్పుడే పెళ్ళి గొడవా...." తలచుకొన్న కొలదీ ఆశ్చర్యంగా ఉంది పట్టాభికి. "కలవారి బిడ్డ గనుక ఏమైనా చేయగలరు నేను సీత పెళ్ళెలా చేసేదీ?" నిత్యం అదే దిగులు అతడిని క్రుంగదీయసాగింది.

## 6

గున్నమామిడివలెవున్న మాధురిని తనివి దీరా చూచుకొంటూన్న విశాలాక్షికి పట్టాభి ఆగమనం పానకంలోపుడక వచ్చినంత చిరాకుగా తోచింది. "ఇప్పుడేగా వచ్చింది! అప్పుడే వార్త ఎవరు అందించారో?" అని సణుక్కుంది.

"వచ్చావా తల్లీ!" తనివితీరా—తను వంతా కనులు చేసుకుని చూశాడు పట్టాభి మాధురిదెస. నిండుగా ప్రేమ పురస్సరంగా నవ్వాడు. "నేను చెప్పలేదా తల్లీ అర్నెల్లకల్లా పచ్చగా మళ్ళీ వస్తావని! నీ కోరికేమోగానీ, నాకుమాత్రం మనవరాలే కావాలి. ఆ బుల్లి బుల్లి చేతులకు నేను గాజులు తొడగాలి!" ఎంత సంతోషంగా మాట్లాడుతున్నా, పట్టాభి స్వరంలో ఏదో అపశ్రుతి పలుకుతోంది.

"బాగున్నావా తాతా!" ఓ వంక సిగ్గులు కురిపించుతూనే మాధురి మనఃపూర్వకంగా ఆదరప్రశ్న వేసింది.

"ఆఁ! బాగానే వున్నాను తల్లీ." ఏమిటో పిచ్చివాడిలాగా తల ఆడించాడు. లేని నవ్వును తెచ్చుకుంటూ. అంతలోనే ఒక్కసారిగా భోరున విలపించసాగాడు ముఖాన గుడ్డ వేసుకుని. "నా బాగునే అడిగావా తల్లీ? ఏమని చెప్పను నా ఖర్మ!"

అయోమయంగా చూసింది మాధురి.

విరసనగా, విసుగ్గాచూసింది విశాలాక్షి. "శుభమా అని—బిడ్డ పురిటికివస్తే నీ గోలేమిటి పట్టాభీ? కాస్సేపు బయటకు వెళ్ళు. ఇక్కడ ఏడవటోకు." అని గట్టిగా కసిరింది.

మరింత విస్మబోయి చూచింది మాధురి 'సీత ఏదీ!' అని అడగబోయిన ఆమె మాట గొంతులోనే ఉండిపోయింది.

"అవునులే తల్లీ. మర్చిపోయాను. తల్లి ప్రసవానికని పచ్చగావస్తే నా గోల ఏమిటి!" కళ్ళు తుడుచుకుని మామూలు మనిషైపోయాడు. "వస్తా తల్లీ. రేపు గాజులు తెస్తాను." అనేసి వడివడిగా వెళ్ళిపోయాడు.

"ఏమిటమ్మా! అసలు సంగతేమిటి! తాత ఏడుస్తున్నాడెందుకు పాపం!"

"ఊరుకుందూ మాధురీ. ఇప్పుడొచ్చావోలేదో ఎందుకీ వెధవగొడవలన్నీ నీకు!" కూతురి ప్రశ్నను త్రుంచివేస్తూ కసరివేసింది విశాల.

అంతతో అప్పటికి ఆ ప్రసంగం ఆగిపోయింది. క్రొత్తగా అత్తింటి నుంచి పుట్టింటికి వచ్చిన సందడిలో మాధురి మస్తిష్కంలో తాత్కాలికంగా ఆ సంగతి మరుగున పడిపోయింది.

కుమార్తె కాపురం యెంత బాగా సాగుతున్నదో, అల్లుడు యెంత చక్కటి ప్రవర్తన కలవాడో మరీ మరీ తెలుసుకుని మురిసిపోయింది విశాల.

మర్నాడు భోజనానంతరం సాయంకాలంగా అందరూ హాలులో కూర్చున్న తరుణంలో పట్టాభి వచ్చాడు గాజుల మూటతో! పెద్ద కావడీతో గాజులమ్మే పట్టాభి చిన్నమూట భుజాన వేసుకు రావటం ఆశ్చర్యమే అనిపించింది మాధురికి.

"రా తల్లీ. ఎన్నాళ్ళయింది నీ చేతులకు గాజులు తొడిగి!" కూర్చుని మూట విప్పి గాజులు ఎంచుతూ మాధురిని ఉద్దేశించి పిలిచాడు పట్టాభి. "ఇది తియ్యని బాధ



యు !

తల్లీ. చేతులు నొప్పిపుట్టినా గాజులు వేసు కోవాలి. కష్టపెట్టినా అనక పండంటి పాపాయి ముద్దే వస్తాడు. జీవితమే తియ్యటి బాధ తల్లీ ........"

సంతోషంగా తన ధోరణిలో మాట్లా డేస్తూ, గాజులు ఎంచుతూన్న పట్టాభి విశాల కఠినస్వరంతో విని తలెత్తి చూశాడు.

"వద్దు పట్టాభీ" ఖరారుగా అన్నది విశాల. "ఇకనుంచీ, మేం కబురంపితే కానీ రావద్దు వెళ్ళు."

"అమ్మగారూ!!!" అమ్మగారెందుకంత కోపంగా ఉన్నారు? వినరాని విషయమేదో విన్నట్టు ఆక్రోశించాడు.

"కోపం లేదు. కోపం నాకు దేనికి గానీ—నీ చేతులతో అమ్మాయికి గాజులు వేయటం నా కిష్టం లేదు!"

అవాక్కైపోయిన పట్టాభి అలా వెర్రిగా చూడసాగాడు.

మాధురి మూగగా తిలకించ సాగింది.

"అవును పట్టాభీ. నువ్వేం బాధపడకు మరి!" భద్రమ్మ అన్నది. "గాజులు ఆడవాళ్ళకి మంగళప్రదమైనవి. మరి ఖూనీ చేసిన చేతులతో ఆ గాజులు వేయించు కోవటం—శుభప్రదమైన పనికాదు!"

వెర్రివాడిలా అందరి ముఖాలూ మార్చి మార్చి చూశాడు పట్టాభి. "పెద్దమ్మగారూ! ఈ నాటికి తమరు కూడా నన్నిలా అస హ్యించుకుంటున్నారా?" కనుల నీరు గ్రక్కుకుంటూ అడిగాడు.

భద్రమ్మ బాధగా అన్నది. "ఏం చేస్తాం పట్టాభీ, పద్ధతులు పద్ధతులే కదా! వెళ్ళిరా మరి!"

"నేను ఖూనీకోరునా అమ్మా? నా కడుపుబాధ తెలియకే అన్నారా మీరా మాట?" కుమిలి కుమిలి ఏడ్చాడు పట్టాభి.

భద్రమ్మ కూడా కనులు ఒత్తుకుంది.

విశాలాక్షి ముఖం చిట్లించింది.

మాధురికి అంతా అగమ్యగోచరంగా వుంది.

తనకు తానే సంబాళించుకున్న పట్టాభి మెల్లగా మామూలు మనిషై పోయాడు. "నిజమే అమ్మగారూ, మీరు పెద్దలు. మీకు తెలియని దుంటుందా? ఉన్నమాటే అన్నారు కాని, మీకైనా నామీద కోప మేమీ లేదుగా? "స్వచ్ఛమైన గొంతుతో అన్నాడు, ఒక చిన్న అట్టపెట్టెను భద్ర మ్మకు అందించుతూ, "అమ్మాయిగారి కోసమని ప్రత్యేకంగా పట్టుకొచ్చాను తల్లీ. నా పాపిష్ఠి చేతులకు తొడిగే అర్హత లేకపోయింది. ఉంచండి, తెచ్చి నది తిరిగి తీసుకువెళ్ళలేను. మీ చేతు లతో అమ్మాయిగారి చేతులకు తొడగండి ఆ గాజుల్ని." అన్నాడు అర్థింపుగా.

వంచిన తల ఎత్తకుండానే అందు కున్నది భద్రమ్మ.

కన్నీళ్ళతో తననే తదేకంగా చూస్తూన్న మాధురివైపు తిరిగాడు పట్టాభి. "చిట్టి చిట్టి పాపల్ని ఎత్తు కుంటూ వెయ్యేళ్ళు సుఖంగావుండు చిట్టి

తల్లీ." మనసారా దీవిస్తూ. మెల్ల మెల్లగా కదలి కనుమరుగై పోయాడు.

"ఎవరైనా ఏమైనా అనుకోండి. కాని నామాట చెబుతున్నాను. నువ్వా గాజులు వేసుకోవటం నాకిష్టంలేదు మధూ." రుస రుస లాడింది విశాలాక్షి.

నిస్సహాయంగా, ఎటూ నిర్ణయించుకోలేని అనిశ్చలతతో నిట్టూర్చింది మాధురి. గాజులను పెట్టెలో భద్రపఱచుకుంటూ. "తాతకు నామీద ఎంతో ఆపేక్ష. ఇక అమ్మదా—తల్లి ప్రాణం! ఎవరిని ధిక్కరించగలను?" మౌనంగా ఆక్రోశించింది అసహాయ అంతరంగం.

తర్వాత, తల్లికి తెలియకుండా నాయనమ్మ నుండి విషయ సేకరణ కావించిన మాధురి విలవిల్లాడిపోయింది. "చిన్ననాటి నేస్తం—సీత మరిలేదు" అనుకొంటే ప్రాణం పిండినట్లే అయ్యింది.

తాను పెళ్ళై భర్తతో వెళ్ళిపోతూన్న రోజు సీత ఎవ్వరూ లేకుండా చూచి తన గదిలోకి వచ్చింది, "ఏమిటి సీతా?" ఆప్యాయంగా అడిగింది తాను.

మొదట సిగ్గుపడింది సీత. ఎంతో మొహమాటం ప్రదర్శించి, చివరకు తన చేతిలోని కాగితపు పొట్లాన్ని మాధురి చేతులో వుంచింది. "అందరూ ఎంతెంతో గొప్ప బహుమానాలిచ్చారమ్మాయిగారూ మీకు. నాకూ ఏమైనా ఇవ్వాలన్పించింది. నవ్వకండేం?"

పొట్లాంవిప్పి చూచింది మాధురి. అద్దాలు అంటించిన ఎఱ్ఱటిగాజులు ఆరు! అందంగా చక్కగా వున్నాయి. శ్రీకృష్ణునికి కుచేలుడు అటుకులు బహూకరించిన కథ గుర్తుకు వచ్చిన మాధురి మధురంగా నవ్వింది. "చాలా బాగున్నాయి సీతా!" అంటూ వెంటనే చేతికి వేసేసుకుంది.


సీత వదనం ఆనంద విస్ఫారిత మైంది .... . ...

..........అదే ఆఖరుసారిగా చూడడం సీతను!

మాధురి మనసంతా శోకం ఆవరించింది, మాతృహీన సీత! అమాయిక! అటువంటి సీతనుకూడా క్రూరంగా హత్య చేయగల వారుంటారని ఎవరైనా అనుకుంటారా?

అసలు జరిగినవిషయం — పట్టాభి సీత వివాహం చేయాలని చింతించి చింతించి ఆఖరుకు రెండువేలు అప్పు చేసి సీత పెళ్ళిచేశాడు. ఒక వెయ్యి కట్నంగా. మిగిలిన వేయితో బట్టలూ, ఓ చిన్న నగా పెట్టి సంతృప్తిగానే చేశాడు పెళ్ళి. కొద్దిగా భద్రమ్మ సాయంకూడా లభించింది సీత పెళ్ళికి. సీత భర్త ఒక చిన్న కిళ్ళీకొట్టు యజమాని. భార్యాభర్త లిరువురూ కొద్దిరోజులు—ఒకటి రెండునెలలు అన్యోన్యంగానే గడిపారు. పట్టాభి తృప్తిగా విశ్రాంతిగా నిట్టూర్చాడు కాని అతడికి ఆమాత్రం తృప్తిగా కూడా బ్రతికే అర్హత లేదన్నట్టుగా ఘోర విషయం జరిగిపోయింది........పట్టాభి

యువ




కూతుర్ని నానా బాధలూ పెట్టి ఆత్మహత్యకు దారి తీయించిన ఆమె అత్త. ఇప్పటికీ ఇంకా కక్ష విడువలేదు కోడలిపట్ల. తన కోడలు దుర్మార్గ వర్తినియై, మరి దారి లేక ఆత్మహత్య చేసుకొన్నదనే వదంతి లేవదీసింది. ఆ పుకారు సీత అత్తవారి వఱకూ వెళ్ళడం, మరుక్షణంలోనే సీతను హీనంగా జమకట్టడమూ జరిగి పోయింది. ఆమెకు పుడమి పైననే యమ లోకం కన్పించ సాగింది.

"లేచిపోయిన దాని కూతురు" అంటూ అనునిత్యం అత్తగారు సాధించసాగింది.

"నీకు మాత్రం ఆగుణాలు రావా? చెట్టొకటి అయితే కాయ మరొకటెందు కౌతుంది? ఎప్పుడో ఎవడితోనో నువ్వూ పోతావన్నమాట." అన్నాడు భర్త.

విసిగిపోయిన సీత ఒకనాడు తిరిగి ఏదో అన్నది.

దానితో ఆ పశుప్రాయుడు ఒళ్లు తెలియకుండా చావగొట్టాడు. ఆ దెబ్బలకు సీత అప్పటికప్పుడే స్పృహ తప్పిపోయి ప్రాణం విడిచింది. తెలివైన భర్తా, అత్తా "పీడ విరగడైం" దని సంతోషించి ఆ శవాన్ని నూతిలో పడవేసి, కాలుజారి పడి మరణించినట్లుగా చెప్పారు.

అసలు జరిగినవంతా ఇరుగుపొరుగు లందరికీ తెల్సు. అయినా పోలీసులకు నిజం చెప్పటాని కెవరూ సాహసించ లేదు.

పట్టాభి కడుపుశోకం ఎవరు వర్ణించ గలరు?

"నా సీతా, పోయావటే అమ్మా!" అని ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. కేసుపెట్టి, పోరి న్యాయం పొందగల ధన

వంతుడూ లౌక్యుడూ కాదు పట్టాభి. కాని అతడి కడుపు కోత?

"నా చిట్టితల్లిని నాకు లేకుండా చేసి నోళ్ళని వేనూ లేకుండా చేసేశాను. ఒక్కొక్క వ్రేటుకి నరికి పారేశాను. ఏంటో — వేరం — ఖూనీ — అదీ యిదీ అంటారు. పై మనుషులకేం — ఎన్నైనా చెప్తారు. నా కష్టంలాంటి కష్టం ఆ జడ్జీకీ, ప్లీడర్‌కీ వస్తే అళ్లుమాత్రం నే జేసినపని సెయ్యకుండా వుంటారా? ఏ కష్టానికైనా తేడా వుందేమో గానీ, కన్న కడుపు ఏడ్చే యేడుపుమాత్రం ఒక్కటే. గొప్పా, బీదా — చదువూ గిదువూ తేడా లేమీ లేవు!" అంటాడు పట్టాభి నిర్భయంగా గుండెలు బాదుకుంటూ. "అవును. నేనే చంపాను. నరికి పారేశానని ఒక్క మాటలో నేను చెబుతూంటే మీరు ఇన్ని పార్లు — ఇన్నిరోజులు — ఇందరు మనుషులు సాగదీస్తున్నారేంటి ఎదవగోడవా?" ఏం శిక్ష ఏస్తారో ఒక్కసారిగా ఏసి పారేయరాదా?" అన్నాడట పట్టాభి కోర్టులో రొమ్ము విరుచుకుని. పట్టాభికి యావజ్జీవ కారాగారశిక్ష పడింది. కాని జైలులో అతడు ఎక్కువ కాలం గడపలేదు కొన్ని కొన్ని ప్రత్యేక సందర్భాలలో, సంతోష పూర్వకంగా ఖైదీల నందరినీ విడిచిపెట్టి వేయడం ప్రభుత్వం వారి ఆనవాయితీ. అటువంటి ఒక సందర్భంలో పట్టాభి బందీఖానా నుంచి విముక్తి పొందాడు.

కాని పట్టాభి ప్రాపంచిక జీవితంలో చాలా మార్పు వచ్చింది. తిన్నపూట తింటాడు. వరుసగా రెండేసిరోజులు అసలు తిననే తినడుకూడా. గాజుల అమ్మకమే జీవనోపాధి గనుక అలాగే అప్పుడప్పుడు ఒక గాజులమూట భుజాన పెట్టుకు తిరుగుతాడు. పూర్వంవలె భారీ అమ్మకం లేదు. అసలు అతడు అమ్మకపు కేకలు వేయడమే మానేశాడు. తనను అర్థం చేసుకొని ఆదరించే వారి యిండ్లకు మాత్రమే వెళ్తాడు. దయార్ద్ర హృదయులైన ఆ గృహిణులు యిచ్చేవాటితోనే రోజులు గడిచిపోతున్నాయి.

చాలమంది అతడిని చూచి దూరంగా తొలగిపోతారు. భయం భయంగా చూస్తారు. గుసగుస లాడ్తారు. కాని పట్టాభి అన్నిటికీ అతీతుడైనట్టుగా వారి దెస చూడనే చూడడు.

బయట ప్రజ బ్రతకనీయరు. గుడిసెలో అతడు బ్రతకలేడు. ఎటుచూచినా సీత నడయాడుతూ అదృశ్యమౌతూ దోబూచులాడుతున్నట్టే వుంటుంది. కూతురికోసం కంటె మనుమరాలికోసం అధికంగా దుఃఖిస్తూ దురపిల్లుతున్నదా వృద్ధుని హృదయం.

విషయమంతా సాంతం వినిన మాధురి కంపించిపోయింది. "నీవంటి, సీతవంటి సుస్వభావులకు స్థానంలేని ప్రపంచమైపోయింది, తాతా!" అని విలపించిందామె మనసు.

# 7

సాయంత్రం వేళ వాహ్యాళికి వెళ్ళిన మాధురి దంపతులకు, ఏకాంతంగా నదిఒడ్డున ఏదో తలపోతలలో మునిగి పరధ్యానంగా వున్న పట్టాభి కన్పించాడు.

"తాతా!" తీయగా పలుకరించింది మాధురి. "మా గాజుల తాత యితడే, అప్పుడప్పుడు మీకు చెప్తూంటాను. ఎన్నెన్ని గాజులు యిచ్చేవాడనీ నాకు చిన్నతనంలో!" భర్తకు ఆ విధంగా పరిచయం చేసింది.

పలకరింపుగా చిరుహాసం చేశాడు మురళి. "మీ అమ్మాయిగారికి నువ్వంటే చాలా అభిమానమోయ్! రోజూ తల పెడ్తూనే వుంటారు!"

ఎందుకో—భర్త మాటలాడే తీరు నచ్చలేదు మాధురికి. అయినా మాట్లాడకుండా వూరుకుంది. "ఓయ్ ఓయ్— ఏమిటీ ముసలి వాడిని పట్టుకుని?" అనుకుంది.

చూడముచ్చటగావున్న ఆ జంటను, నోటమాట లేకుండా కళ్ళప్పగించి చూస్తూండిపోయాడు తాత. "అప్పుడు పెళ్ళిలో చూడడమే బాబుగారూ మిమ్మల్ని!" అన్నాడు కడకెలాగో.

అలా ఏవో పొడి పొడి మాటలు మాట్లాడాక గృహోన్ముఖు లయ్యారు మురళీ మాధురీ.

"చూడు తాతా!" నచ్చజెప్పబోతూన్నట్లుగా అన్నది మాధురి. "ఆ రోజు అమ్మ అలాగన్నందుకు నువ్వేం కష్టపెట్టుకోకు. మరి పెద్దవాళ్ళకి ఏవో నమ్మకాలుంటాయి కదా."

"పిచ్చి తల్లీ." విష్కల్మషంగా నవ్వాడు పట్టాభి "ఇంతమాత్రం దానికి నాకు నువ్వు నచ్చజెప్పాలా? అది నే నెప్పుడో మరచిపోయాను!"

అది అబద్ధమని యిద్దరికీ తెలుసు. "మరచిపోతే మళ్ళీ గాజులు తెచ్చి ఇవ్వక పోయేవాడా? మళ్ళీ రానేలేదుగా!" అనుకుంది మాధురి "సీత సంగతి విన్నాను తాతా ...ఎంత అన్యాయం!" డగ్గుత్తికతో అన్నది.

అంతలో ఓ విరక్తి నవ్వు నవ్వాడు పట్టాభి. "మిమ్మల్ని చూస్తే సీతే కళ్ళలో మెదల్తు దమ్మాయిగారూ! మిమ్మల్ని చూపిన్నాడు—అది లేదని నాకు అనిపించదు. ఇంత బాధలోనూ మిమ్మల్ని చూస్తే నా కదో సంతోషం." మళ్ళీ నవ్వాడు బాధగా. "బ్రతుకే తియ్యనిబాధ అమ్మాయిగారూ, కష్టం సుఖం కలగాపులంగా ఉంటాయి. అలాగే ఓసారి ఏడ్చినా యింకొకసారి నవ్వుతూ బ్రతకాలి. పిల్ల పోయిందన్నాక మరి బ్రతకాలనిపించలేదు తల్లీ నాకు. కాని చూశారా బ్రతికే వున్నాను! ఏమిటో! అయినా నాకు ఒక్కోసారి అనిపిస్తుందమ్మాయిగారూ—సీత ఏదో పడవలసిన బాధంతా ఒక్కసారే పడి చచ్చిపోయింది—అదృష్టవంతురాలే

వని.'' దానికి నేను మినహా ఎవరూ లేరు. ఏ కష్టం—సుఖం వచ్చినా పాపం దాని నెవరు ఆదుకొనేవాళ్ళు? ఏకాకిగా బ్రతికే కష్టంలేదు దానికి వెళ్ళిపోయింది .. పోయినవాళ్ళు అదృష్టవంతులే. నాలాటి వాళ్ళు మిగులుతారు ఏడవటానికి!''

తుది మొదళ్ళులేని ఈ వేదాంతధోరణి మురళిని భయపెట్టింది. ''నడు మధూ, ఆలస్యమైంది! చీకటిలో పురుగూ పుట్రా ఉంటాయి.'' అంటూ దారితీశాడు మాధురి అనుసరించింది.

"పండక్కి వచ్చారు గామాలు అల్లుడు గారు కూడా! విశాలమ్మగారు అదృష్ట వంతులు. కూతురూ—అల్లుడూ—రాక పోకలూ!'' అనుకున్నాడు పట్టాభి మళ్ళీ ఆలోచనలో పడాడు. 'అమ్మాయిగారికి ఆడపిల్లా, మగపిల్లాడా? ఎవరుపుడతారూ? అమ్మాయే పుట్టాల మరి నేను గాజు లివ్వొద్దూ? వొద్దు వొద్దు ఆడజన్మ— కష్టాలమారి బ్రతుకు. ఆడపిల్లా—ఆ చుట్టూవుండే నానా కష్టాలూ నా చిట్టితల్లి గారికివొద్దు ........"

"ఏమిటిందాకటి సంగతి. నువ్వేదో అంటున్నావ్ పట్టాభితో?'' దారిలో అడి గాడు మురళి.

వివరించింది మాధురి అమూలాగ్రంగా పట్టాభి కథను.

మురళి మొదట ఏమీ అనలేదు. తర్వాత సాలోచనగా తల పంకిస్తూ "ఏమో! బాపికోరు! ఇద్దర్ని చంపాడు. నువ్వు అతడితో అంత ఆత్మీయంగా మాట్లాడకూడదు మధూ!''

మాధురి అమితంగా బాధపడింది. ''ఒక్కమాటలో—ఒక్క సమావేశంలో సామాన్యులకు అర్థం అయ్యే మనిషేనా తాత!''

ఆరోజునుంచీ కూడా శుభవార్తకోసం ఎదురుచూస్తూ ఆత్రత పడుతున్నాడు తాత సాయంత్రంవేళ—సూర్యాస్త మానం తిలకించుతూ అలా అవేవో చెప్పు కుంటూండేవారు తాతా, మాధురీ కాలవ ఒడ్డున.

మరోవారం రోజులు పోయాక మాధురి షికారు రావటంకానీ బయట కన్పించటంగానీ ఆగిపోయింది. ప్రసవించే రోజులు దగ్గరు పడుతున్నా యన్నమాట! మాధురి స్వంత తల్లీ తండ్రికంటె తాను ఆత్రంగా ఎదురుచూస్తూ, ఆమె క్షేమం కొలకు వేయి దేవుళ్ళకు మొక్కుతూ న్నాడు నిత్యం పట్టాభి సీత మరణానం తరం క్రుంగిపోయిన అతడు, మాధురి పునర్దర్శనంతో కొంత తేరుకుని, వుత్సా హాన్ని పుంజుకున్నాడనడం అతిశయోక్తి కాదు. రాయిలా రాగరహితంగా బ్రతుకు తూన్న అతడు మరల లౌకిక విషయా లలో కొలది ఆసక్తి కనబరచసాగాడు.

## 8

ఉదయం ముఖం కడుక్కుంటూన్న పట్టాభి దారిన పోయేవారి మాటలు అప్రయత్నంగా విని తలెత్తాడు. వెంక




్రామయ్య ఇంటి పాలేరు ఎవరితోనో అంటున్నాడు: "నిన్న అమ్మాయిగారికి కొడుకు పుట్టాడు, సాయంత్రం మూడింటికి!"

చేతులెత్తి దేవుడికి నమస్కరించాడు పట్టాభి. "నా తల్లిని చల్లగా చూచాడు!" అనుకున్నాడు. "ప్చ్. మగపిల్లాడా? అమ్మాయి అయితే ఎంత బాగుండేది! చక్కగా నేను గాజులు తొడిగేవాడిని! ఆడకూతురు అందమే వేరు. ఇంటికి కళ!"

రాస్తా మీది మనుషులు ఇంకా మాట్లాడుకుంటూనే వున్నారు. "ఎవరూ అంత సంతోషంగా లేరు పెద్దశాంతి వుందట. తండ్రి గండాన పట్టాడట."

"ఏడిశారు!" అసహ్యపడ్డాడు పట్టాభి. "పుట్టిన పసికందు—కళ్ళైనా తెరవని గుడ్డు ఇన్నాళ్ళనుండి ఈ భూమ్మీద బ్రతుకుతున్న వాళ్ళకి ఏం అపకారం చేయగలదు? ఇంట్లో పిల్లాజెల్లా వుండడం, మళ్ళీ వాళ్ళకి బిడ్డా పాపా కలగడం ఎంతటి అదృష్ట కరమైన సంగతి! దాని విలువ తెలియక ఏదేదో అనుకుంటారు!"

బజారువెళ్ళి, శక్తి మేరకు రెండు చిన్న చొక్కాలు ఏరి ఏరికొని, ఎంతో సంతోషంగా చూడబోయాడు వెంకట్రామయ్య ఇంటికి పట్టాభి.

"నమస్కారం బాబుగారూ, అమ్మాయిగారు . ."

పట్టాభిమాట పూర్తి కాకుండానే సాదరంగా తానే మాట్లాడాడు వెంకట్రా

మయ్యి. "రా, రా, పట్టాభీ, నిన్న అమ్మాయికి మగబిడ్డ పుట్టాడు." సంతో షంగానే చెప్పాడు

"విన్నాను బాబుగారూ." పట్టాభి ముఖమంతా ఆనందహాసంతో వెలిగి పోతోంది "అందుకే చూసి పోదామని వచ్చాను, పెద్దమ్మగారెక్కడ బాబూ!"

"అమ్మాయిగారి గదిలోనే వున్నారు వెళ్ళు లోపలికి."

వసారాలోనే ఎదురైంది విశాలాక్షి. నమస్కరించాడు పట్టాభి.

"తల్లీ బిడ్డా కులాసానా, అమ్మగారూ?" అనడిగాడు.

"ఆఁ కులాసాయే పట్టాభీ." విశాల వదనంలో ఏభావమూ లేదు.

"ఏ గదిలో వున్నా రమ్మా?"

"లోపల పెరటి గదిలో! ....... ఇప్పుడేం చూస్తావ్ లే తాతా పురిటికందుని! గదిలోకి అందరూ వెళ్ళటం ఆరోగ్యకరం కాదు. స్నానమయ్యాక వచ్చిచూడు!"

మారు మాట్లాడలేకపోయాడు పట్టాభి. "అలాగే లేండమ్మగారూ. . భగవంతుడు చల్లగా చూశాడు. అదే సంతోషం. ఈ చొక్కాలు ..వుంచండమ్మగారూ. ఏదో పేదోడిని. ఎంత మనసున్నా మంచి బహుమానాలు తేలేదు."

ఏకళన వున్నదో విశాలాక్షి! తిరస్కరించకుండా తీసుకుంది.

"ఎమిటో మేమంటే నీకు ఒల్లమాలిన ఆపేక్ష. స్నానమయ్యాక అమ్మాయిని వచ్చి చూసిపోమరి!"

"అలాగేతల్లీ." వెనుదిరిగిన వాడు మళ్ళీ వెనక్కు వచ్చాడు." చంటిబాబు ఎలావున్నాడమ్మా ఎట్టగా—బొద్దుగా వున్నారా?"

"ఆఁ!" చప్పరించేసింది విశాలాక్షి. "ఎంత బొద్దుగా పుట్టినా అంతా నీరేగా. నాలుగోనాటికి బాగా తీసిపోతారు పిల్లలు. మూడునెలలు దాటితేగానీ అసలు రూపు రేఖలు బయటపడవు. ఇప్పుడే చెప్పలేం ఎవరిపోలికో! వెళ్ళిరా మరి. తల మునిగే పని నాకు!"

మౌనంగా గృహోన్ముఖుడయ్యాడు. "నారేఖ మారిపోవటంతో నాపట్ల గల ఆదరాభిమానాలూ సన్నగిలిపోయాయి. అమ్మాయిగారిని ఎత్తుకుమోసిన వాడిని- అమ్మాయిగారి పెళ్ళికి నడుం కట్టి పనిచేసి బహుమతులు అందుకున్నవాడిని—ఈ నాడు అమ్మాయిగారిని చూచే అర్హత కూడా కోల్పోయాను!" అనుకుంటూ.

## 9

"ఇవ్వాళ పదకొండో రోజు! స్నానం అయిపోతుంది అమ్మాయిగారికి. పోయి చూడాలి." నిద్రలేస్తూనే అనుకున్నాడు పట్టాభి. కాని రెండ్రోజులుగా జ్వరంతో వున్న అతడి శరీరం కాస్తయినా కదలను నిరాకరించింది. మగతగా పడివున్నాడు మరో రెండ్రోజులు.

దయార్ద్రత గల పొరుగు వృద్ధురా

యు వ



మంత్రి: "అంబులెన్సు సంగతి తర్వాత చూడవచ్చు; ముందు ప్రెస్ రిపోర్టరును, ఫోటోగ్రాఫర్ను పిలవండి."

లోకామె అప్పుడప్పుడు కాస్త కాఫీ బలవంతంగా గొంతులో పోసి ప్రాణాలు విలిపింది పట్టాభిని

నాలుగోనాడు ఉదయం తెలివి వచ్చిన పట్టాభి సంతోషించలేదు. దుఃఖిస్తూ అన్నాడు వృద్ధురాలితో. "నేను బ్రతికి ఏం చేయాలే కొండప్పా? అలా ఆ మగతలోనే ప్రాణాలు పోతే ఎంత బాగుండేది! ఎందుకు బ్రతికించావ్ నన్ను?"

"చాలూరుకో అన్నా, ఏం జేస్తాం? బాధల్లో వున్న ప్రాణానికి అలాగే అన్పిస్తది మరి!"

అవ్వతెచ్చిన వేడిగంజి త్రాగాక కొద్ది సత్తువ వచ్చినట్లయింది పట్టాభికి. "మూడు నాల్గురోజులు పడున్నాను కదూ ఈ జ్వరంతో" జ్ఞాపకం చేసుకుంటూన్నట్టు అన్నాడు. "అన్నట్టు అమ్మాయిగారిని చూడాల. మొన్ననే స్నానం అయిపోయి వుంటది కదా! పాపిష్టిజ్వరం ..."

"ఎక్కడికి" అవ్వ తలచి అడిగింది.

"అదే. మన పెద్దకామందు వెంకట్రామయ్యగా రమ్మయిగారికి కొడుకు పుట్టాడుకదూ? చిట్టితల్లికి చిన్నప్పటినుంచీ నా దగ్గర మాలిమి ఎక్కువ."

గతుక్కుమన్నది అవ్వ. ఓ క్షణం ఆగి, "ఎళ్లొచ్చులే. రేపు కపింత కూడు దిన్నాక. ఏం తొందర!" అన్నది ఉదాసీనంగా.

"అమ్మో. రేపటిదాకానా?" మంచం

మీంచి లేచి గుడ్డలు మార్చుకుంటూ అన్నాడు. "ఉడుగ్గంజి తాగాక మంచి బలమొచ్చిందిలే. నాకేం వర్వాలేదు "

గుమ్మందాటిపోతూన్న అతడిని వారించ శక్యంకాలేదా వృద్ధురాలికి. "ఓరి నా మాటినరా పట్టాభయ్యా. ఇప్పుడు ఆ అమ్మాయిగారు "

"ఆఁ. అమ్మాయిగార్ని ఇప్పుడే చూడాలి." రోడ్డెక్కిపోతూ అరిచాడు పట్టాభి "ఓ గంటలో వచ్చేత్తాలే." గబగబ సాగిపోయాడు

సగందారిలో గుర్తుకు వచ్చింది పట్టాభికి "అమ్మాయిగార్ని చూడటానికి వట్టిచేతులతో ఎట్లా వెళ్ళేది?'

వెనక్కుపోయి మార్కెట్టులో వెదకీ వెదకీ అఖరుకు ఓ డజను ఒట్టిగాజులు సంపాదించాడు. పువ్వులూ, పళ్ళూ కొన్నాడు. "డబ్బులు నాల్రోజుల్లో ఇచ్చేత్తాలే" అన్నాడు షాపువాడితో.

"అరువుబేరమా? ' దుకాణాదారుకు పట్టాభి ఖూనీకోరు అనే సంగతి బాగా తెల్సుగనుక మాటలు సరిగా పైకి వెలువడలేదు.

"నాల్రోజులేగా? ఇచ్చేస్తాలే. నా బంగారుతల్లికి ఒట్టిగాజులంటే మహా యిష్టం! ఓటువీగిటువీ లేకుండా చూసి, మంచివి ఎన్నికచేసి యివ్వు!"

లోపల చావిడిలో వాలుకుర్చీలో కళ్ళు మూసుకుపడుకున్న వెంకట్రామయ్య దగ్గఱగా వెళ్ళి "దండాలు బాబుగారూ " అన్నాడు పట్టాభి రెండుసార్లు.

"ఊఁ." వెంకట్రామయ్య కళ్ళు విప్పకుండానే అన్నాడు నీరసంగా మూలిగినట్టు. "నిద్రపోతున్నట్లున్నారు!" అనుకున్నాడు మళ్ళీ పిలచినా అదేఫలితం పట్టాభి దిక్కులు చూశాడు ఎక్కడా ఎవ్వరూ కన్పడలేదు. మెల్లగా లోపలకు నడిచాడు ఏవో భయం ఆవరించగా. పెరటి వసారాలో విశాలాక్షి రాయిలా కూర్చుని వుంది కదులూ మెదులూలేక. ఎంత పిలిచినా పట్టాభిదెస చూడలేదు

"అమ్మగారూ, అమ్మగారూ!" విశాలాక్షి ఒక్కసారి కళ్ళెత్తిచూచి మళ్ళీ శిలలా వుండిపోయింది మాటాపలుకూ లేకుండా

పట్టాభికి కాళ్ళాడలేదు. ఏమిటిది. ఇల్లింత భీతావహంగా వుంది?


"అమ్మాయిగారూ, అమ్మాయిగారూ! చిట్టితల్లీ!"

గోడలే సమాధానంగా మార్మోగాయి.

అంతలో పసిబిడ్డ ఏడుపు వినవచ్చింది. "కేర్" మంటూ ఉత్తరం వైపు పంచపాళీనుంచి.

ఆత్రంగా అటు పరుగెట్టాడు పట్టాభి. ఏడుస్తూన్న బిడ్డను భద్రమ్మ సముదాయిస్తోంది కన్నీటితో—

మంచం నడుమ శిలా విగ్రహంలా కూర్చొనివున్నది మాధురి. చలన రహితంగా—గోడవైపుకు తిరిగివున్న దామె




ముఖం, విరబోసుకున్న జుత్తు మాత్రమే కన్పిస్తోంది పట్టాభికి.

"అమ్మాయిగారూ! అమ్మాయిగారూ! మిమ్మల్ని బాబునీ చూట్టానికి వచ్చాను తల్లీ ...ఏం మాట్లాడ రేవరూ? ఆలస్యంగా వచ్చాననా? మొన్ననే రావలసింది గానీ ఎధవ జ్వరం పీల్చిపిప్పి చేసేసింది. ఏంజేయను చెప్పుతల్లీ?" రెండడుగులు ముందుకు వేశాడు.

మాధురి తిరిగి చూడలేదు.

"తాతమీదే కోపం వచ్చిందా తల్లీ నీకు? వద్దు ఇలాచూడు, ఈగాజులు నీకోసం తెచ్చాను తల్లీ." అందివబోయాడు, దగ్గరిగా వెళ్ళి.

కళ్లెత్తి తాతదెస చూచింది మాధురి.

పామును చూచినట్టు అడుగు వెనక్కు తీసుకున్నాడు పట్టాభి.

"అమ్మాయిగారూ!!" ఆ ఆక్రోశానికి దిక్కులే దద్దరిల్లాయి. చేతిలోని గాజులు నేలపడి తునా తునకలయ్యాయి. కుప్పకూలి పోయాడు.

"నే చూడలేను తల్లీ, నేను భరించలేను" ముఖం కప్పుకొని బావురుమన్నాడు. "కళ కళలాడే నిన్ను ఇంతలోనే మంగళహీనంగా తయారు చేయటానికి ఏం పాపం చేశాం తల్లీ?' క్రుళ్ళి క్రుళ్ళి ఏడ్చాడు. భద్రమ్మ శోకం తారస్థాయి నందుకుంది. వసారాలోనుంచి విశాలాక్షి రాగాలు వినవస్తున్నాయి. మాధురి విరాగినిలా కూర్చున్నది బాధల కతీతమైనట్టు.

"నాసీత లేకపోయినా, నువ్వు పచ్చగావున్నావని మురిశాను కదా తల్లీ! నేనెలా బ్రతకను? నేనెలా బ్రతకను!!"

అతడి శోక ప్రవాహం సుళ్ళు తిరిగి పోతోంది.

ఏడుపులూ, ఊడుపులూ అయిన తర్వాత భద్రమ్మ చెప్పింది: 'బిడ్డ పుట్టాడన్న సంతోషంతో చూడటానికి వస్తూంటే దార్లో కారుకు యాక్సిడెంటు అయి మరణించాడు మాధురి భర్త''

పుట్టిన బిడ్డవైపు ఒక్కసారి చూసాడు తాత. భారంగా బయటకు నడిచాడు. "తండ్రి గండాన పుట్టాడు!" అతడి చెవులలో రింగు మన్నాయి పాలేరు మాటలు. బిడ్డను ఎత్తుకోవాలని గానీ, మరొక్క క్షణం అక్కడ నిలవాలని అన్పించలేదు ఒక్కసారిగా మతిపోయిన అతడికి

# 10

"చూడమ్మా. పిల్లవాడిని దగ్గరకు తీసుకో. ఎలాగేడుస్తున్నాడో చూడు.''

భద్రమ్మ మాటలను మాధురి విన్పించుకోలేదు. అలా అన్యమనస్కంగా చూస్తూ కూర్చుంది.

నిట్టూర్చింది భద్రమ్మ. "ఇక అలాగే కూర్చుంటే ఎలా తల్లీ? పోయిన వాళ్ళతో పోలేంకదా మనస్సు రాయి చేసుకోవాలి''

బిడ్డకు తానే పాలుపట్టి నిద్ర పుచ్చింది భద్రమ్మ.

కాస్సేపటికి విశాలాక్షి వచ్చింది కూతురి గదిలోకి. "చూడు మధూ, నిద్రలో నీకొడుకెంత అందంగా నవ్వుతున్నాడో! చిట్టిబాబు!'' ప్రేమగా వాడి బుగ్గలు నిమిరింది. అంతలో దుఃఖం ముంచుకురాగా వడివడిగా బయటికి పోయింది.

మాధురి అప్పటికీ కదలలేదు ఆమెలోని చైతన్యం నశించి పోయిందా— అన్నట్టు కూర్చున్నది కదలకుండా

ఎవరిమాటలూ ఆమె ధ్యాసను మళ్ళించలేకుండా వున్నాయి.

"రెండు రోజులుగా అమ్మాయి పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టడం లేదు. ఏమీ మాట్లాడదు నాకేమిటో భయంగావుంది.'' భర్తను పట్టుకొని గోడు గోడున ఏడ్చింది విశాలాక్షి.


వెంకట్రామయ్య మెల్లగా కూతురి వద్దకు వెళ్ళాడు.

పడుకున్న బిడ్డను తదేకంగా చూస్తూ విరాగినిలా కూర్చున్న కుమార్తెను చూచిన తండ్రి ప్రాణం గిల గిల లాడి పోయింది. ఏమి చెప్పటానికీ నోరురాక, పసివాడిని చూస్తూ మరోప్రక్కన కూర్చున్నాడు

అంతలో సుడిగాలిలా పరుగెత్తుకు వచ్చాడొక నౌఖరు. "అయ్యగారూ, గాజుల పట్టాభి చచ్చి పోయాడట!''

"ఆఁ!'' ఒక్క ఉదుటున లేచాడు వెంకట్రామయ్య. "ఎప్పుడూ?''

"మొన్న ఇక్కడికొచ్చి వెళ్లాక మంచాన పడి మరి లేవలేదట. ఈ ప్రొద్దున్న




ప్రాణం పోయిందట! . . . శవాన్ని మన వీధినుంచే తీసుకు పోతారట! చచ్చిపోతూ కూడా అమ్మాయిగారూ, అన్నేయం జరిగిపోయింది. అని ఏడ్చాడట పరాకుగా!''

''గజులతాత చచ్చిపోయాడా!'' అంతవరకూ ఒక్కమాట కూడా మాట్లాడని మాధురి అమాంతం గావుకేక పెట్టినట్టు అడిగింది.

''అవునమ్మా, అదుగో బాజాలూ, ఊరేగింపూ, మన వీధికే వస్తున్నాయి.''

కిటికీవద్దకు పరుగెత్తింది మాధురి ముఖం కన్పించనంతగా శవంమీద పూలదండలు కప్పారు. బాజాలు మ్రోగుతున్నాయి. పలుగు రైదుగురు యువకులు బాగాత్రాగి తందనా లాడ్తూ గాలిలో ఎగిరి మొగ్గలు వేస్తూ శవవాహకులకు ముందుగా మహా కోలాహలం సృష్టిస్తున్నారు.

''ఏమిటో కొందరు కొందరు చావులు కూడా పెళ్ళిళ్ళలాగే జరుపుకుంటారు'' అన్పించింది మాధురికి.

''తాతమీద అభిమానమున్న వారంతా చందాలు వేసుకుని జరిపించు తున్నారట!'' నౌఖరు విశదీకరించాడు

శవవాహకులూ వెంటవున్న జనమూ కనుమరుగయ్యారు క్రమంగా

''ఏం పాపం చేశావని దేవుడు నీకీ శిక్ష వేశాడమ్మా?'' ఆనాడు తనకు ప్రాప్తించిన వైధవ్యం గురించి తాత రోదించడం, దైవాన్ని నిందించడం తలపుకు వచ్చాయి మాధురికి. బాధగా మూలిగిందామె హృదయం. నీకు భార్య గతించింది కుమార్తె ఆత్మహత్య చేసుకొంది. మనుమరాలు ఘోరంగా హత్య

చేయబడింది. జీవితమంతా రోదిస్తూనే వున్నావు. నువ్వేం పాపం చేశావని తల తునకలయ్యే కష్టాలతో తల్లడిల్లి తనువు చాలించావు? పోయావుకదా దేవుడిదగ్గ రకు? అడుగు అతగాడిని—ఏ పాపమూ చేయని అమాయకులతో ఎందుకు చెల గాటాలాడుతావని? .... సవ్యంగా సలక్ష ణంగా సత్యమార్గాన నడవడమే మనం చేసిన పాపమేమో!"

భారంగా నడచివచ్చింది కిటికీ దగ్గఱ నుండి శయ్యవద్దకు. పసివాడు నిద్రలో అమాయకంగా నవ్వుతున్నాడు దేవుడి తోనేమో! "బిడ్డకు దిష్టి తగలకుండా" అంటూ చేతులకు బుల్లి బుల్లి నల్లగాజులు తొడుగుతోంది భద్రమ్మ.

మాధురి మనస్సు కలుక్కుమన్నది.

గాజులను ఎప్పుడు ఏ సందర్భంలో చూచినా తాత గుర్తుకు వస్తాడు. "నొప్పి పెట్టినా చేతులకు గాజులు వేసుకోవాలి. ఇదొక తీయనిబాధ తల్లి అనేవాడు పదే పదే తనకు గాజులు తొడుగుతూ.

"ఏమిటో—బ్రతుకే తియ్యని బాధ అమ్మాయిగారూ. కష్టం సుఖం కలిసే వుంటాయి కలగాపులగంగా. ఓసారి ఏడుస్తూ బ్రతకాలి సీతలేదన్నాక ఇక బ్రతకాలన్పించలేదు— అయినా బ్రతి కాను... .." అంటూ ఎన్నెన్నో మాట్లాడాడు ఒక్క నెలక్రితమే. వైరా గ్యంగా ఏమేమో అంటున్నాడనుకున్నారు తమ దంపతులానాడు. కాని ఆ మాట లలో ఎంత నిజం?" తానంటే ప్రాణం పెట్టేతాత, తనను ప్రాణాధికంగా ప్రేమిం చిన భర్త—ఇరువురూ తనను వీడి తనువులు చాలించారు.

పసివాడింకా బోసి నవ్వులు కురి పిస్తూనే వున్నాడు నిద్రలో. ఆ నవ్వు చూచిన మాధురి మనసులో తీయని మమత తలెత్తి అంతంలోనే ప్రఫుల్లాని మహా వృక్షమైంది. ఆప్యాయంగా లేవ నెత్తి గాఢంగా గుండెల కదుముకున్నది. మొదటిసారిగా.

ఈ నాల్గు రోజులనుండీ— భర్త మరణవార్త విన్న దగ్గఱనుండీ ఇక తనకు బ్రతకాలన్పించలేదు. పుట్టిన బిడ్డ ముఖమే చూడక పోయింది. ప్రాణం తీసుకొనే మార్గం అన్వేషిస్తోంది మనసు. కాని ఇప్పుడా యోచనే ఘోరంగా అన్పి స్తోంది. చావాలనిలేదు. అమ్మో! తండ్రి లేని ఈ పసికందును తల్లికూడా లేని నిర్భాగ్యుణ్ణి చేయలేను చేతులారా! తల్లీ తండ్రీ లేని సీత జీవితం ఎంత అధ్వా న్నంగా వుండేదో — ప్రేమార్ద్రతలు కరవై ఎంతగా కొట్టుకు పోయేదో నేను బాగా ఎరుగుదును. మా అమ్మ నన్ను ప్రేమగా చూచి దగ్గఱకు తీసుకుంటే సీత కనులు చెమరించడం ఎన్నోసారులు ... తెలిసీ తెలిసీ విన్నటువంటి దుర్గతికి త్రోయను. నీకోసం బ్రతుకుతాను బాబూ. నీకోసం బ్రతుకుతాను!"

తనలో తానే వేదాంతిలా నవ్వుకొంటూ "నిజంగా బ్రతుకే తీయని బాధ కదూ? అక్షరజ్ఞానమూ, విద్యాగంధమూ ఏమా త్రమూ లేని తాత మానవ జీవితాన్ని ఎంత ఘనంగా వ్యాఖ్యానించాడు"